క్లుప్తంగా

ఘనంగా లక్ష్మీనృసింహస్వామికి ముడుపుల పూజలు



ముడుపుల పూజలందుకుంటున్న లక్ష్మీనృసింహస్వామి

సీతానగరం: స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకూ ఆలయప్రధాన అర్చకుడు పి.శ్రీనివాసాచార్యుల పర్యవేక్షణలో భక్తులతో ఘనంగా ముడుపుల పూజలు జరిగాయి. ముడుపుల పూజలకు భక్తులు వందలాది కిలోమీటర్ల దూరం నుంచి వివిధరకాల పూజాసామగ్రితో హాజరయ్యారు. పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికీ నిర్వాహకులు తీర్థప్రసాదాల వితరణ చేశారు.

1200 ఓటర్లు దాటిన పోలింగ్‌స్టేషన్లు గుర్తించండి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సుధారాణి

సాలూరు: 1200మంది ఓటర్లు దాటిన పోలింగ్‌స్టేషన్లు గుర్తించాలని డీఆర్‌డీఏ పీడీ, సాలూరు నియోజకవర్గం ఎన్నికల ప్రత్యేకాధికారి సుధారాణి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద గురువారం వివిధ రాజకీయ పార్టీల నేతలతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు జాబితాలో చనిపోయిన వారిని గుర్తించి సంబంధిత బీఎల్‌ఓకు అందించాలని తెలిపారు.కార్యక్రమంలో తహసీల్దార్, పలురాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విరగ్గాసిన వాక కాయలు



వాక చెట్టుకు కాసిన కాయలు

సీతానగరం: ఆయుర్వేద మందులుగా వినియోగించే వాక్కాయలు ఇంటి ముందున్న వాకిళ్లలో విరగ్గాశాయి. మండలకేంద్రంలోని కొమ్మినేని వారింటి లోగిలిలో నిమ్మ, వాక్కాయలు, గజనిమ్మ, వివిధ రకాల పూల మొక్క తోటలు ఆహ్లాదకరమైన వాతావరణంలో పెంచుతున్నారు. ఇళ్లలో జలుబు దగ్గు నివారణకు వాక్కాయలు వినియోగిస్తుంటారు. ఈ నేపథ్యంలో ఆయుర్వేద వైద్యులు వాక్కాయలు సేకరించే పనిలో ఉండగా చెట్టుకున్న కాయలను చూసి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెండింగ్ సర్వే పూర్తి చేయాలి



వైద్యపరీక్షలు చేస్తున్న డా. తిరుమల ప్రసాద్

పార్వతీపురం రూరల్: ఎన్‌సీడీ అండ్ సీడీ పెండింగ్ సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని బందలుప్పి ప్రాథమిక కేంద్ర వైద్యాధికారి డా. తిరుమల ప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు గురువారం హెచ్‌కారాడవలసలో 104 ద్వారా ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఈ శిబిరం ద్వారా 48మందికి వైద్యపరీక్షలు చేసి వారికి అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో ఎన్‌సీడీ అండ్‌సీడీ సర్వే సరళిని అడిగి తెలుసుకుని సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ శిబిరంలో వైద్యసిబ్బందితో పాటు ఆశవర్కర్లు, 104 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛసర్వేక్షణ్‌లో సాలూరు మున్సిపాలిటీకి 9వ ర్యాంకు



సాలూరు మున్సిపల్ కార్యాలయం

సాలూరు: స్వచ్ఛసర్వేక్షణ్ 2025కు గాను సాలూరు మున్సిపాలిటీకి 9వ ర్యాంకు వచ్చినట్టు అధికారులు తెలిపారు. 20వేల నుంచి 50 వేల జనాభా ఉన్న 49 పట్టణాల్లో సాలూరుకు ర్యాంకు వచ్చిందని పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బాలకృష్ణను ఈ సందర్భంగా మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు అభినందించారు.

ప్రజలకు మేలు జరగాలనే జగన్ పోరాటం



మరిపల్లిలో బాబు మోసాలపై ప్రచారంలో పాల్గొన్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

- అబద్ధాల బాబును నిలదీయాలి
- మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు రూరల్: ప్రజలకు మేలు జరగాలనే జగన్ మోహన్ రెడ్డి బాబు మోసాలను ఎండగట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆయన ఆదేశాల మేరకు బాబుష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమం ద్వారా ప్రజలు ప్రభుత్వ పథకాలు పొందేవిధంగా చైతన్యం చేస్తున్నామని మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. ఈ మేరకు గురువారం ఆయన మండలంలోని మరిపల్లి గ్రామంలో బాబుష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాబు మోసాలను ప్రజలు ఇప్పటికే అవగాహన చేసుకున్నా రన్నారు. బాబు మోసాలను ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేయడం లేదని ఎన్నికల్లో బాబు ఇచ్చిన హామీలు నెరవేర్చాలనే నిశ్చయంతో ప్రజల్లోకి వెళ్తున్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే అమలు చేస్తామన్న పథకాలు జూన్ 2024 నుంచి అమలు చేయాల్సి ఉందన్నారు. అయితే ఇంతవరకు కనీసం ఒక్క పథకాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోవడం ప్రజల దురదృష్టమన్నారు. పింఛన్ పథకం రూ.నాలుగు వేలు అని చెబుతున్న చంద్రబాబు ప్రభుత్వం గత ప్రభుత్వంలో రూ.మూడువేలు పింఛన్ ఇచ్చిన విషయం మరిచిపోవద్దన్నారు. పింఛన్ పథకం సామాజిక భద్రతగా ఏ ప్రభుత్వం వచ్చినా ఇవ్వాల్సిందేనని అది సంక్షేమ పథకం కాదన్న విషయం గుర్తుంచుకోవాలని సూచించారు. 50 సంవత్సరాలకే పెన్షన్‌తో పాటు కొత్త పెన్షన్లు ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. ఆంక్షలు లేకుండా పథకాలు ఇస్తామని ఇప్పుడు ప్రతి పథకానికి అనేక ఆంక్షలు విధించడం అన్యాయమన్నారు.

లెక్క కట్టి ఇస్తామన్న డబ్బులు ఎక్కడ?

ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు, పవన్ కల్యాణ్ సంతకాలు చేసిన బాండ్ పేపర్‌ను చూపిస్తూ ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాల ద్వారా ఆ ఇంటిలో ఈ పథకాలకు ఎంతమంది అర్హులున్నారో అందరి పేర్లు రాసుకుని ఫోన్‌కు ఒక ఓటీపీ పంపించి ఈ పథకాలకు మీ ఇంట్లో వారంతా అర్హులని చెప్పి ఏడాదికి ఎన్ని డబ్బులు వస్తాయో వివరించిన కూటమి నాయకులు ఇప్పుడు ఆ డబ్బులు ఇవ్వకుండా ఎక్కడ దాస్తున్నారో చెప్పాలని రాజన్నదొర డిమాండ్ చేశారు. రైతు భరోసా, ఉచిత బస్సు, ఏడాదికి మూడు సిలిండర్లు, ఆడబిడ్డ నిధి, నిరుద్యోగ భృతి అన్ని పథకాలు కలిసి లక్షల్లో ప్రభుత్వ పథకాలు అందుతాయని ఆశ చూపించి తీరా అధికారంలోకి రాగానే అప్పుల ఆంధ్రప్రదేశ్ అయిపోయిందని, పథకాలు ఇవ్వలేమని బహిరంగంగానే చంద్రబాబు చెబుతూ ఆయన మోసాలు ఆయనే ఒప్పుకున్నారన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు సంతకాలు చేసిన బాండ్‌పేపర్‌లు ఇప్పుడు ఎక్కడ దాచారో చెప్పాలని ప్రశ్నించారు.

'అన్నదాత సుఖీభవ' కోసం ఎదురు చూపులు

అన్నదాత సుఖీభవ పథకంలో రూ.20 వేలు ఎప్పుడు ఇస్తారోనని రైతులు ఎదురు చూస్తున్నారని మరిపల్లి ఎంపీటీసీ జన్ని సీతారాం అన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై వ్యవసాయ పెట్టుబడులు పెట్టలేక అప్పులు పుట్టక రైతులు అల్లాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ కాగాన పోలినాయుడు, వైఎస్సార్‌సీపీ మండల నాయకులు సువ్వాడ రామకృష్ణ, పార్టీ మండల అధ్యక్షులు సువ్వాడ భరత్ శ్రీనివాస్, పార్టీ జిల్లా నాయకులు దండి శ్రీను, శివరాంపురం ఎంపీటీసీ కోళపల్లి త్రినాథ, తదితరులు పాల్గొన్నారు.

కూటమికి బైబై..!

- వైఎస్సార్‌సీపీలో చేరిన మాజీ కౌన్సిలర్



వైఎస్సార్‌సీపీలో చేరిన కూటమి మాజీ కౌన్సిలర్ గొర్లి వెంకటరమణ

పార్వతీపురం టౌన్: కూటమి పార్టీలకు చెందిన మాజీ కౌన్సిలర్ గొర్లి వెంకటరమణ గురువారం వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మాజీ శాసనసభ్యుడు అలజంగి జోగారావు సారథ్యంలో జిల్లా కేంద్రంలో జరిగిన బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ కార్యక్రమంలో పార్లమెంట్ సభ్యురాలు గుమ్మ తనూజారాణి, పార్టీ జిల్లా అధ్యక్షుడు శత్రుచర్ల పరీక్షిత్ రాజుల సమక్షంలో మాజీ కౌన్సిలర్ గొర్లి వెంకటరమణ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పరీక్షిత్ రాజు ఆయనకు పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానం పలికారు. ప్రజలకు మేలు జరగాలన్నా, వారి తరఫున పోరాడాలన్నా రాష్ట్రంలో ఉన్న ఏకైక ప్రతిపక్ష పార్టీ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అని పరీక్షిత్ రాజు ఈ సందర్భంగా అన్నారు.

అందరం కలిసి సమష్టిగా ప్రజల పక్షాన నిలిచి పోరాడి ప్రజలకు మేలు జరిగే విధంగా కృషి చేద్దామని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయన్నారు. కార్యక్రమంలో తూర్పు కాపు కార్పొరేషన్ మాజీ చైర్మన్ మామిడి శ్రీకాంత్, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ మున్సిపల్ చైర్‌పర్సన్ బోను గౌరీశ్వరి బీసీసెల్ అధ్యక్షుడు గొర్లి మాధవరావు, వైస్ చైర్మన్లు కొండపల్లి రుక్మిణి, ఇందుపూరు గున్నేశ్వరరావు, కౌన్సిలర్లు, పార్టీ సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైలు గేటు సమస్యను పరిష్కరించాలి

- ఎంపీకి వినతి

పార్వతీపురం రూరల్: మండలంలోని బాలగుడబ గ్రామంతో పాటు పలు మండలాలకు చెందిన ప్రజలు, ప్రయాణికులు నిత్యం బెలగాంలో ఉన్న రైల్వే గేటు వద్ద అవస్థలు పడుతున్నారని, తక్షణమే పరిష్కారం చూపాలని అరకు ఎంపీ గుమ్మ తనూజారాణికి బాలగుడబ తాజా, మాజీ సర్పంచ్‌లు, జెడ్పీటీసీ బలగ రేవతమ్మ గురువారం వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు క్యాంపు కార్యాలయానికి వచ్చిన ఎంపీని కలిసి సమస్యను వివరించారు. ఎంపీని కలిసిన వారిలో మువ్వల సత్యంనాయుడు, పండు, వర్రి శ్రీనివాసరావు తదితరులున్నారు.



ఎంపీకి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పార్వతీపురం టౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగనుందని విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గోపాలరావు నాయుడు తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఐటీడీఏ 11కేవీ ఫీడర్ పరిధిలో ఉన్న వీధులకు విద్యుత్ సరఫరా అంతరాయం కలుగుతుందన్నారు. చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల నిర్వహణ పనులు జరుగుతాయని, దీనివల్ల రామానంద్ నగర్, పోస్టాఫీసు వీధి, ఆర్టీసీ కాంప్లెక్స్ మెయిన్ రోడ్డు, గొల్ల వీధి, నాయుడు వీధి, మైదానం వీధి, మద్దెల వీధి, చిన్న హరిజన వీధి, గాంధీనగర్, బూరాడ వీధి, నారాయణ స్కూల్ ఏరియా, కలెక్టర్ ఆఫీస్ ఏరియా వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. పురప్రజలు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

సాలూరులో నేడు..

సాలూరు: విద్యుత్ లైన్ల దగ్గర్లో ఉన్న చెట్ల కొమ్మలు తొలగించడం తదితర విద్యుత్ మెయింటనెన్స్ పనుల నేపథ్యంలో సాలూరు పట్టణం, మండలం, పాచిపెంట మండలాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ గోపాలరావు నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఆటోనగర్ సబ్‌స్టేషన్ పరిధిలో సాలూరు పట్టణ, మండలంలోని ప్రాంతాలు, పాచిపెంట మండలంలో గురివినాయుడుపేట సబ్‌స్టేషన్ పరిధిలో మండలంలోని గ్రామాల్లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ప్రజలు గమనించి సహకరించాలని కోరారు.

షెడ్యూల్ ఏరియా ఉద్యోగాలు గిరిజనులకే ఇవ్వాలి

- గిరిజన సంఘం నాయకుడు రంజిత్ కుమార్

పార్వతీపురం రూరల్: రాజ్యాంగ సవరణ చేసైనా షెడ్యూల్ ఏరియాలో ఉన్న ఉద్యోగాలను గిరిజనులకే ఇవ్వాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయిబాబు, పాలక రంజిత్ కుమార్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పార్వతీపురం ఐటీడీఏకు వచ్చిన రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ డైరెక్టర్ సదా భార్గవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు జీఓ నంబర్ 3 సక్రమంగా అమలు కాలేదని, అందుకే జీఓలు కాకుండా చట్టాలను తేవాలని, డిమాండ్ చేశారు. డీఎస్సీ నోటిఫికేషన్‌కు ముందే జీఓ నంబర్ 3పై అభిప్రాయ సేకరణ తీసుకుని ఉంటే బాగుండేదని అభిపాయ సేకరణ కేవలం కాలక్షేపం, కాలయాపన కోసమే చేస్తే గిరిజనుల తరపున పోరాటం తప్పదని స్పష్టం చేశారు. అలాగే ఆదివాసీ ఆరోగ్య సిబ్బందిని విధుల్లోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సదాభార్గవితో మాట్లాడుతున్న రంజిత్ కుమార్

పారిశుద్ధ్య పనుల పరిశీలన

మక్కువ: మండలకేంద్రంలో ఈవో బి.శ్రీనివాస్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న పారిశుద్ధ్య పక్షోత్సవాల్లో భాగంగా గురువారం పారిశుద్ధ్య కార్మికులు చేపడుతున్న పనులను ఎంపీడీవో డీడీ స్వరూపరాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యపనులు జరిపించాలని, ఎక్కడ చెత్త కనబడినా ఉపేక్షించేది లేదన్నారు. తాగునీటి వనరుల వద్ద క్లోరినేషన్ జరిపించాలని సూచించారు. వర్షాకాలం కావడంతో, సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందే అవకాశమున్నందున అధికారులు ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరారు. ఈనెల 15వతేదీ నుంచి, 31 వరకు కలెక్టర్ ఆదేశాల మేరకు పారిశుద్ధ్య పక్షోత్సవాలు నిర్వహించనున్నామని ఎంపీడీవో స్వరూపరాణి తెలిపారు.



మక్కువలో పారిశుద్ధ్యపనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో స్వరూపరాణి

డ్రగ్స్ బారిన పడకుండా జాగ్రత్తపడాలి

- ఎస్సై ఎం.రాజేష్

సీతానగరం: విద్యార్థులు తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యాధికులు కావాలని, డ్రగ్స్ బారిన పడకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని ఎస్సై ఎం.రాజేష్ హితవు పలికారు. ఈ మేరకు మండలంలోని జోగింపేట డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయంలో మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్య పరమైన సమస్యలు, ఇతర సమస్యలపై విద్యార్థులకు ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఈశ్వరరావు ఆధ్యక్షతన అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా విద్యార్థులకు ఎస్సై విద్యార్థులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై ఎం.రాజేష్

అవగాహనే ఆయుధం

- రూరల్ ఎస్సై బి.సంతోషి కుమారి

పార్వతీపురం రూరల్: ప్రమాదాల నుంచి, అపాయం నుంచి బయట పడేందుకు వాటిపై అవగాహన కల్పించుకోవడమే వాటి నుంచి తప్పించుకునేందుకు మార్గమవుతుందని పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి అన్నారు. ఈ మేరకు గురువారం మండలంలోని అడారు గ్రామంలో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. ప్రధానంగా విద్యార్థులతో గుట్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పిస్తూ వివరించారు. ఈ సందర్భంగా ఆమె చిన్నారులతో మాట్లాడుతూ పిల్లలు ఎవరి సమక్షంలోనైనా సురక్షితం అనిపించకపోతే గట్టిగా అరవడం, కొరకడం, నెట్టివేయడం వంటివి ఏవిధంగా చేయాలో పిల్లలకు తెలియజేశారు. తల్లిదండ్రులే తమ చిన్నారులకు అవగాహన కల్పించడంలో ప్రధాన పాత్ర పోషించాలని సూచించారు.



చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న రూరల్ ఎస్సై సంతోషి కుమారి

వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యంపై పర్యవేక్షణ ఉండాలి

పార్వతీపురం టౌన్: వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యంపై పర్యవేక్షణ ఉండాలని జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్మోహన్ రావు అన్నారు. ఈ మేరకు పట్టణంలోని 16వ వార్డులో ఉన్న గిరిజన సంక్షేమ బాలుర వసతి గృహాన్ని గురువారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ మధ్యకాలంలో విద్యార్థుల్లో ఎవరికైనా అనారోగ్య సమస్యలు ప్రబలాయా అని సిక్ రిజిస్టర్ పరిశీలించారు. ఏ విధమైన ఆరోగ్య సమస్యలు తలెత్తాయి, అందజేసిన చికిత్స, రిఫర్ చేసిన వివరాలు, రికవరీ అయిన తేదీలు గమనించారు. ప్రాథమిక చికిత్స నిమిత్తం వసతి గృహంలో ఉంచిన మందులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు సీజనల్ వ్యాధులైన మలేరియా, టైఫాయిడ్, డయేరియా లక్షణాలపై వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, ఎపిడమిక్ ఈఓ సత్తిబాబు, హెల్త్ సిబ్బంది శ్రీరజని, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం అధికారి డాక్టర్ జగన్మోహన్

ఒప్పంద అధ్యాపకుల రెన్యువల్‌కు ఆహ్వానం

సాలూరు: 2025–26 విద్యాసంవత్సరానికి జిల్లాలో గల ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న అధ్యాపకులను రెన్యువల్ చేసేందుకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా ఐడీ కళాశాల సాలూరు ప్రిన్సిపాల్ డా.కె.ఉషశ్రీ ఓ ప్రకటనలో గురువారం తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరంలో 30 ఏప్రిల్ 2025 నాటికి ఒప్పంద అధ్యాపకులుగా పనిచేసిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకునేందుకు అర్హులని స్పష్టం చేశారు. దరఖాస్తులను శనివారం సాయంత్రం 5 గంటలలోపు సంబంధిత కళాశాలలోనే సమర్పించాలని సూచించారు. జిల్లా సెలక్షన్ కమిటీ సమక్షంలో ఈ నెల 21 నుంచి 23 వ తేదీలోపు కౌన్సెలింగ్ నిర్వహించి రెన్యువల్ చేస్తామన్నారు.24వ తేదీన అగ్రిమెంట్ చేసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు.

మక్కువ పీహెచ్‌సీ వైద్యాధికారిగా సాయితేజ



మక్కువ: మక్కువ పీహెచ్‌సీ వైద్యాధికారిగా సాయితేజ గురువారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నానికి చెందిన సాయితేజ మక్కువ పీహెచ్‌సీ–2వైద్యాధికారిగా ఇంతవరకు విధులు నిర్వహించారు. ఇంతవరకు ఇక్కడ వైద్యాధికారిగా విధులు నిర్వహించిన హరికృష్ణకు ఏలూరు బదిలీ అయ్యింది.రోగులకు సంతృప్తికరంగా వైద్యసేవలందిస్తానని వైద్యాధికారి సాయితేజ ఈ సందర్భంగా తెలిపారు.

అందరికీ ఎరువుల పంపిణీకి చర్యలు

సీతానగరం: మండలంలో ఖరీఫ్‌సీజన్‌కు అవసరమైన ఎరువులు రైతులకు సకాలంలో పంపిణీ చేయనున్నట్లు ఎమ్మెల్యే బోనెల విజయ చంద్ర అన్నారు. ఈ మేరకు మండలంలోని బళ్లకృష్ణాపురంలో గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలకు అవసరమైన సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్నామన్నారు. అనంతరం ఏఓ ఎస్.అవినాష్ ఆధ్వర్యంలో రైతులకు ఎరువులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపీడీఓ ఎంఎల్ఎన్ ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.సత్యన్నాయుడు, ఆర్.వేణుగోపాలనాయుడు, టి.వెంకటప్పలనాయుడు, టి. చంద్రశేఖర్, అరవింద్‌కుమార్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు గాయాలు

పాలకొండ రూరల్: మండలంలోని తంపటాపల్లి నుంచి వీరఘట్టం మండలం వండువకు ద్విచక్ర వాహనంపై వెళుతున్న భార్యాభర్తలు కె.భూషణరావు, భారతి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. గురువారం వీరిద్దరూ బైక్‌పై వెళ్తుండగా.. వీరి ముందు వెళ్తున్న ఆటో తంపటాపల్లి కూడలిలో ఒక్కసారిగా కుడివైపునకు తిప్పడంతో ఆటోను ఢీకొని కింద పడ్డారు. వెంటనే స్థానికులు స్పందించి గాయపడిన భార్యాభర్తలను స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. క్షతగాత్రుల ఫిర్యాదు మేరకు ఎస్సై కె. ప్రయోగమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన ఆటో బూర్జ మండలానికి చెందినదిగా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం....

మండలంలోని బుక్కూరు గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికురాలు ఈ నెల 10న రోజువారీ పనుల నిమిత్తం పాలకొండ వచ్చి తిరిగి స్వగ్రామం చేరుకోలేదు. దీంతో ఆమె భర్త ఆనంద్, కుటుంబ సభ్యులు వెతికినా ఫలితం లేకపోవడంతో గురువారం పాలకొండ పోలీసులను ఆశ్రయించారు. వీరు అందించిన వివరాల మేరకు ఎస్సై మిస్సింగ్ కేసు నమోదు చేశామన్నారు.

వ్యవసాయపనుల్లో రైతన్నలు బిజీబిజీ



పనసభద్రలో నారుమడికి అదును లేకపోవడంతో ఐరన్‌వీడర్‌తో దున్ని, నారుపోస్తున్న రైతులు



తెలగడవలసలో ఉభాలు నాటుతున్న మహిళలు



ఎర్రసామంతవలసలో మొక్కజొన్న విత్తనాలు నాటుతున్న మహిళారైతులు

మండలంలో బుధవారం రాత్రి కుండపోత వర్షం కురవడంతో, గురువారం రైతులు ఖరీఫ్‌సాగు పనుల్లో బిజీగా ఉన్నారు. వరినారు పోసేందుకు పంటపొలాలు వర్షపునీరుతో తడిచిపోవడంతో, అదునులేక రైతులు ఐరన్‌వీడర్ సహాయంతో దుక్కిదున్ని నారు పోశారు. అలాగే మొక్కజొన్న విత్తనాలు నాటేందుకు, దమ్ములు, ఉభాలు జరిపించేందుకు వర్షం మేలుచేయడంతో రైతులు పంటపొలాల్లో వ్యవసాయపనులు చేపడుతూ కనిపించారు. – మక్కువ

అద్దె బస్సు డ్రైవర్లతో సమావేశం నిర్వహించాలి

- సమస్యలు పరిష్కారం కాకుంటే 19నుంచి పోరాటం

పార్వతీపురం: అద్దెబస్సు డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు లేబర్ కమిషనర్ వద్ద చర్చలకు యజమానులు కూడా హాజరుకావాలని, సమస్య పరిష్కారం కాకపోయినా, సమావేశానికి హాజరు కాకపోయినా 19తేదీ నుంచి ఆందోళన నిర్వహిస్తామని సీఐటీయూ నాయకులు స్పష్టం చేశారు. ఈ మేరకు పార్వతీపురం ఆర్టీసీ అద్దె బస్ డ్రైవర్ల డిమాండ్ల పరిష్కారం కోరుతూ యూనియన్ అధ్యక్షుడు కేవీ చారి అధ్యక్షతన పార్వతీపురంలోని బెలగాం సుందరయ్య భవనంలో గురువారం విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, జిల్లా కోశాధికారి జి వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షుడు రెడ్డి వేణులు మాట్లాడుతూ అద్దె బస్సు డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని కొద్దిరోజుల క్రితం లేబర్ అధికారుల వద్ద జరిపిన చర్చల్లో యజమానులకు నష్టాలు వస్తున్న కారణంగా వేతనం పెంచలేకపోతున్నామని చెప్పడంతో సమావేశం అర్ధాంతరంగా ముగిసిందన్నారు. యజమానుల వాదనలో వాస్తవం లేదని కార్మికులు చెబుతున్నప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. అద్దెబస్సు యజమానులకు చిత్తశుద్ధి ఉంటే మళ్లీ డ్రైవర్లతో చర్చించి డిమాండ్లపై సానుకూలంగా స్పందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యూనియన్ సెక్రటరీ టీడీ.ప్రసాద్, ట్రెజరర్ ఎస్.మన్మథరావు, అశోక్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు మన్మథ రావు